





తెలంగాణ ముద్దుబిడ్డకు సముచిత గౌరవం

- పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డుపై హర్షాతిరేకాలు
- దేశం ఆర్థికశక్తిగా ఎదగడంలో కీలకపాత్ర వహించారు: మంత్రి తుమ్మల
- జాతి గర్వించదగిన గొప్ప వ్యక్తి.. నామా, పువ్వాడ, సండ్ర
- పీవీ అల్లుడి గ్రామం రేగళ్లలో సంబరాలు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. భిన్నవర్గాలకు చెందిన వారు తెలుగువారి ఠీవీ.. పీవీ అని, ఆయనకు అవార్డు రావడం ముదావహమని కీర్తిస్తున్నారు. పీవీకి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో అనుబంధం ఉంది. జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండల పరిధి రేగళ్లకు చెందిన సోమరాజు వెంకటరామారావు సుశీలబాయి దంపతుల కుమారుడైన సోమరాజు రామకిషన్‌ప్రసాద్‌కు పీవీ తన కుమార్తె డాక్టర్ విజయను ఇచ్చి 1988లో వివాహం జరిపించారు. పీవీ కేంద్రమంత్రి హోదాలో ఉన్నప్పుడు ఈ వివాహం జరిగింది. ఆ సమయంలో రేగళ్ల గ్రామానికి ఆయన వచ్చినట్లు సమాచారం. వివాహం జరిగిన కొంత కాలానికి పీవీ కుమార్తె, అల్లుడు అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లి వైద్యవృత్తిలో అక్కడే స్థిరపడిపోయారు. రేగళ్లలో ఉన్నప్పుడు పీవీ తన కుమార్తె, అల్లుడితో పాటు వారి కుటుంబ సభ్యుల యోగాక్షేమాలు తెలుసుకుంటూ ఉండేవారని సమాచారం. పీవీకి భారతరత్న అవార్డు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో బంధువులు, రేగళ్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి తుమ్మల హర్షం

ఖమ్మం సంక్షేమ విభాగం: పీవీకి భారతరత్న అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించటంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. దేశ ప్రధాన మంత్రిగా తొలి తెలుగు వ్యక్తిగా బాధ్యతలు నిర్వహించారని, దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో సంస్కరణలు ప్రవేశపెట్టారని, సంస్కరణల కారణంగా భారతదేశం ఇప్పటికీ ఆర్థికశక్తిగా ప్రపంచ దేశాల ఎదుట నిలిచిందని హర్షం ప్రకటించారు.

నామా, పువ్వాడ...

ఖమ్మం కార్పొరేషన్ : పీవీకి కేంద్రప్రభుత్వం భారతరత్న ప్రకటించటంపై బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వేరువేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. దేశప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం దక్కిందన్నారు. సంస్కరణలు అమలుచేసి దేశాన్ని ఆర్థిక ఇబ్బందులనుండి కాపాడిన మహావ్యక్తి పీవీ అని కొనియాడారు. పీవీ సేవలకు గుర్తింపుగా కేంద్రప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని బీఆర్ఎస్ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వాన్ని కోరారని నామా, పువ్వాడ గుర్తుచేశారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర...

సత్తుపల్లి: పీవీకి భారతరత్న ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం హర్షం ప్రకటించారు. తీవ్రవాదాన్ని రూపుమాపి సాంకేతికతకు జీవం పోసి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మన దేశానికి మంచి భవిష్యత్‌ను అందించిన పీవీకి భారతరత్న ప్రకటించడం సమంజసమన్నారు. ఇదే క్రమంలో తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పి అభివృద్ధి, సంక్షేమ పరిపాలన అందించి దేశ రాజకీయ చరిత్రలో బలమైన ముద్ర వేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావుకు కూడా భారతరత్న ప్రకటించాలని కోరారు.

సకాలంలో చెల్లిస్తే 3శాతం వడ్డీ రాయితీ



రైతులకు డీసీసీబీ చైర్మన్ కె.నాగభూషయ్య సూచన

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 9: కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో రుణాలను వసూలు చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య స్పష్టంచేశారు. నగరంలోని బ్యాంకు ఆవరణలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక రుణాలు సకాలంలో చెల్లించాలని, రుణాలు సకాలంలో చెల్లిస్తే 3శాతం వడ్డీ రాయితీ ఉంటుందని తెలిపారు. పాలకవర్గం బాధ్యతలు స్వీకరించినప్పుడు రూ.7.23 కోట్ల నష్టంలో ఉండగా ప్రస్తుతం డీసీసీబీ రూ.10.88 కోట్ల లాభాలను ఆర్జించిందని వివరించారు. పంట రుణాలు 908.67కోట్లు, విద్యా రుణాలు 91.09కోట్లు, బంగారు తాకట్టుపై రూ. 441.27కోట్లు, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలు రూ.243.72 కోట్లు, ఇతర రుణాలు రూ.152.25కోట్లు ఇచ్చినట్లు వివరించారు. బ్యాంకు టర్నోవర్ రూ. 2948.20 కోట్లుగా ఉందని తెలిపారు. బ్యాంకులో డిపాజిట్లు రూ.1111.19 కోట్లుకు చేరిందని వివరించారు.

కొత్త కార్యాలయానికి స్థలం ఇవ్వండి..



కలెక్టర్ గౌతమ్‌కు డీసీసీ వినతి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 9: ఖమ్మం జిల్లా కేంద్రంలో నూతన డీసీసీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని డీసీసీ కలెక్టర్‌ను కోరింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే వామపక్ష పార్టీలు జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాలకు నామమాత్ర ధరకు ప్రభుత్వ స్థలాలను పొందాయి. అయితే ప్రభుత్వానికి డబ్బులు చెల్లించని కారణంగా కాంగ్రెస్ ఆనాడు కొత్త కార్యాలయం కోసం స్థలాన్ని పొందలేక పోయింది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా అధికారంలోకి కాంగ్రెస్ రావటంతో.. అధికారం ఉండగానే ఖమ్మం జిల్లా కేంద్రంలో ఇల్లు చక్క బెట్టుకునేందుకు డీసీసీ అడుగులు వేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సమావేశాలు ప్రస్తుతం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయమైన సంజీవరెడ్డి భవన్‌లోనే జరుగుతున్నాయి. కార్యక్రమాలు జరిగినప్పుడు స్థలం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో నూతన స్థలం సమకూర్చకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ భావించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిత్యం వహిస్తుండటంతో నగరంలో నూతన కాంగ్రెస్ కార్యాలయం ఏర్పాటు విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలోనే పార్టీ కార్యాలయానికి ప్రభుత్వ నిబంధనల మేరకు స్థలం కేటాయించాలని కలెక్టర్ వీపీ గౌతమ్‌కు లేఖ రాశారు. కాగా ఖమ్మం నడిబొడ్డున ఇప్పుడున్న డీసీసీ భవన్‌ను 1965లో నిర్మించారు. జలగం వెంగళరావు ఆధ్వర్యంలో ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి భవనాన్ని నిర్మించి, అనంతరం సంజీవరెడ్డి భవన్‌గా నామకరణం చేశారు.

పాలేరుకు అరకొరగా సాగర్ జలాలు



తాగునీటి అవసరాలకు సరిపోయేది డౌటే

కూసుమంచి, ఫిబ్రవరి 9: పాలేరు జలాశయానికి సాగర్ డ్యామ్ నుంచి ఆశించిన మేర నీరు చేరలేదు. ప్రభుత్వం 1.50 టీఎంసీల నీరు కేటాయించినప్పటికీ, పాలేరుకు అరకొరగానే 0.7 టీఎంసీల నీరు మాత్రమే చేరింది. 23 అడుగుల నీటిమట్టానికి ప్రస్తుతం 17.20 అడుగుల నీరు చేరింది. శనివారం కల్లా పూర్తి స్థాయిలో నీటి సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు. దీంతో రానున్న మూడు నెలలకు నీరు సరిపోతుందా.. లేదా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఖమ్మం నగరంలో తాగునీటి అవసరాలకు పాలేరు జలాశయం నుంచి మున్నేరుకు శనివారం 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్నారు.





నేరాలకు ముకుతాడు

'సిటీ పోలీస్ యాక్ట్‌ను ఖచ్చితంగా అమలు చేస్తాం.. ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదు.. గంజాయి, డ్రగ్స్ వాటిపై నిఘా పెడతాం. ఇసుక అక్రమ రవాణా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతర నిఘా ఏర్పాటు చేస్తాం..' ఇవి ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సునీల్ దత్ చెప్పిన మాటలు. ఆయన అన్నట్టుగానే బాధ్యతలు స్వీకరించిన నెల వ్యవధిలోనే జిల్లాలో పోలీసింగ్ జరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నెల వ్యవధిలోనే 2476 కేసులు నమోదు కావడం విశేషం.

- జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌లు.. గంజాయి కట్టడికి ప్రణాళికలు...
- పబ్లిక్ న్యూసెన్స్ చేసినా, సమయానికి షాపులు మూయకున్నా కేసులే
- కమిషరేట్ పరిధిలో నెల వ్యవధిలోనే 2476 కేసులు నమోదు
- అందులో 408 బహిరంగ మద్యానికి సంబంధించినవే
- శాంతిభద్రతల పరిరక్షణలో సీపీ సునీల్‌దత్ తనదైన మార్కు

ఖమ్మం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సునిల్‌దత్ తనదైన శైలిలో పలు చర్యలు చేపట్టారు. సంఘవిద్రోహ చర్యలకు పాల్పడే వారిని గుర్తించడంతో పాటు పాత నేరస్తుల కదలికలపై నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లుగా నమోదై ఉన్నవారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్‌లు నిర్వహించారు. పలుమార్లు తానే స్వయంగా కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. గతంలో రౌడీషీటర్లుగా నమోదై ఉన్నవారు మళ్లీ నేరప్రవృత్తికి పాల్పడితే వారిని వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం పలుప్రధాన కేసుల్లో సుమారు 50 మందికిపైగా రిమాండ్‌కు తరలించారు. నేరప్రవృత్తిని వీడి మంచి నడవడిక ఉంటే రౌడీషీట్లను తొలగిస్తామని చెబుతూనే, యధావిధిగా నేరాలకు పాల్పడుతున్నట్టు తేలితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ప్రైవేటు భూముల కబ్జాలకు పాల్పడే రౌడీషీటర్లు, రియల్టర్లపైనా దృష్టి సారించారు. జిల్లాలో గంజాయి విక్రయాలకు, రవాణాకు చెక్‌పెట్టే దిశగా నిఘా పెంచారు. గంజాయికి సంబంధించి ఇటీవల కాలంలో పలువురిని అరెస్ట్ చేశారు.

కేసుల పర్వం..

సిటీ పోలీస్ యాక్ట్‌లో నేరాలను నిరోధించడమే ప్రథమ కర్తవ్యంగా పలు అంశాలపై దృష్టిసారించినట్టుగా తెలుస్తోంది. పబ్లిక్ న్యూసెన్స్ చేసేవారిపైన కేసులు నమోదు చేయడంతోపాటు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై దృష్టి సారించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2476 కేసులు నమోదు చేస్తే, అందులో 408 కేసులు బహిరంగంగా మద్యం సేవించేవారివే ఉన్నాయి. వారిలో 65 మందికి జరిమానా కూడా విధించారు. దీంతోపాటు రాత్రివేళల్లో 11 గంటలు దాటిన తర్వాత కూడా దుకాణాలు తెరిచేవారిపై కేసులు నమోదు చేస్తున్నారు. పుట్టినరోజు వేడుకల పేరుతో రోడ్లపై వాహనాలు అడ్డంపెట్టి అసౌకర్యం కలిగించేవారిపై కూడా సిటీ పోలీసుయాక్టు అమలు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు.

ఇటీవల నమోదైన కేసులు.

- 18ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి ప్రవేశించి ఇక్కడే ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టులు పొందిన నలుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్ చేశారు. సదరు కేసులో నిం దితులు ఇక్కడే పెళ్లిళ్ల చేసుకుని, నివాసాలు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.
- రాత్రి వేళల్లో ఆంధ్రా నుంచి ముదిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలు, మధిర, బోనకల్లు క్రాస్ రోడ్డు వద్ద నెంబరు ప్లేటు లేకుండా ఇసుక కోసం ఆంధ్రా వెళ్తున్న మరో మూడు లారీలను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేశారు.
- సిటీ పోలీస్ యాక్ట్‌లో 2476 కేసులు నమోదు చేయగా అందులో 408 కేసులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నవారు ఉన్నారు. వాటిల్లో ఇప్పటివరకు 65 మందికి జరిమానాలు విధించారు.
- బాల కార్మికులకు విముక్తి కల్పించేందుకు ప్రతియేటా నిర్వహించే ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లో 70 మంది బాలకార్మికులకు విముక్తి కలిగించారు.
- స్టేషన్ల వారీగా 70(ఏ) కింద బహిరంగంగా మద్యంతాగే వారిపై కేసుల ఇలా.. బోనకల్లు 22, చింతకాని 21, ఏన్కూరు 10, కల్లూరు 12, కామేపల్లి 1, కారేపల్లి 1, ఖమ్మం రూరల్ 20, ఖమ్మం వన్‌టౌన్ 40, ఖమ్మం టూటౌన్ 41, ఖమ్మం త్రీటౌన్ 30, ఖానాపురం హవేలి94, కొణిజర్ల2, కూసుమంచి14, మధిర రూరల్17, మధిర టౌన్11, ముదిగొండ17, నేలకొండపల్లి1, రఘునాథపాలెం4, సత్తుపల్లి7, తల్లాడ6, తిరుమలాయపాలెం11, వీఎంబంజర2, వైరా1, ఎర్రుపాలెం 23.



మేడారం అతిథులకు భద్రాద్రి జ్ఞాపికలు

- సమ్మక్క, సారలమ్మ గద్దెల రూపంలో తయారీ
- తొలిసారి ఆదివాసీ కళాకారులతో రూపకల్పన

భద్రాచలం, ఫిబ్రవరి 9: మేడారం సమ్మక్క, సారక్క జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి తరలివచ్చే అతిథుల కోసం ఈసారి ప్రత్యేక జ్ఞాపికలను సిద్ధం చేశారు. మేడారం జాతర 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జాతరకు వచ్చే కీలక అతిథులకు ఆహ్వాన పత్రికతో పాటు మేడారం సమ్మక్క సారలక్క గద్దెల రూపంతో ఉన్న జ్ఞాపికను అందించాలనే సంకల్పంతో వాటిని సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ కమిష్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటీడీఏలోని ఆదివాసీ కళాకారులు కోయ కల్చరల్ ఆర్ట్స్ అండ్ ఫుడ్ క్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో జ్ఞాపికలను సిద్ధం చేశారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం వైట్‌నాగారానికి చెందిన పాయం కృష్ణమూర్తి, భద్రాచలానికి చెందిన పాయం సలీంకుమార్‌లు తమ సిబ్బందితో కలిసి వీటిని రూపొందించారు. వారు రూపొందించిన మేడారం సమ్మక్క సారలక్క గద్దె నమూనాతో ఉన్న జ్ఞాపికలను ఇప్పటికే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క పరిశీలించారు. ఈ జ్ఞాపికలను రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులకు అందించనున్నారు. జ్ఞాపికలను సిద్ధం చేసిన కళాకారులకు గిరిజన సంక్షేమ శాఖ నగదు అందజేయనుంది. తొలిసారి మేడారం జాతరకు తరలివచ్చే అతిథులకు ఆహ్వాన పత్రికతో పాటు జ్ఞాపికను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది.



వెలుగుమట్లలో భూ బాగోతం

- తప్పుడు ఎన్‌వోసీలతో ఎన్నెస్పీ భూముల కబ్జా
- టీఎన్‌జీవో గ్రీన్‌బెల్ట్ భూములకూ ఎసరు
- ఓ కాంగ్రెస్ నాయకుడిపై ఆరోపణలు

ఖమ్మం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో రూ.కోట్ల విలువైన ఎన్నెస్పీ భూముల అక్రమాలపై పోలీస్ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదుచేయడంతో పోలీసుశాఖ దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఓ కాంగ్రెస్ నేతను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఎన్నెస్పీ మిగులు భూములతో పాటు టీఎన్‌జీవో సొసైటీకి చెందిన గ్రీన్‌బెల్ట్ భూములు కబ్జాకు గురైనట్టు బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మొత్తం వ్యవహారంపై ప్రాథమిక దర్యాప్తు చేపట్టగా ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ కాంగ్రెస్ నేతతో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే ఉన్నతస్థాయి నుంచి వత్తిళ్లు రావడంతో పూర్తి స్థాయి విచారణ తరువాతనే పోలీసులు చర్యలకు దిగే అవకాశం ఉంది.

60 ఏళ్ల క్రితం సేకరించిన భూములకు ఎసరు

ఖమ్మంలోని వెలుగుమట్ల సమీపంలోని సాగర్ ఆయకట్టుకు సంబంధించి సాగర్ కాలవ నిర్మాణం కోసం 60 ఏళ్ల క్రితం ప్రభుత్వం భూమిని సేకరించింది. రైతులనుంచి తీసుకున్న ఈ భూమికి ప్రభుత్వం ధర చెల్లించి స్వాధీనం చేసుకుని కాలవ నిర్మాణం చేపట్టింది. అయితే కాలక్రమేణ ఆర్అండ్‌బీ రహదారి వెంట భూములకు ధరలు పెరగడంతో రియల్ వ్యాపారుల కళ్లు ఈ ఎన్నెస్పీ మిగులు భూములపై పడ్డాయి. దీంతో కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత ఈ ఎన్నెస్పీ మిగులు భూములను తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకునేందుకు రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలున్నాయి.

సాగర్ ఆయకట్టులోని ఐదు సర్వేనెంబర్లలో సంబంధం లేని రైతుల పేర్లపై దస్తావేజులు సృష్టించి వారినుంచి కొనుగోలు చేసినట్టుగా నమ్మించి 2018కి ముందు ఎన్నెస్పీలోని ముగ్గురు అధికారులతో ఎన్‌వోసీ తీసుకున్నట్టు తెలిసింది. వాస్తవానికి క్షేత్రస్థాయిలోని అధికారి సంతకం పెట్టకపోవడంతో ఉన్నతాధికారులు అవి ఎన్నెస్పీ భూములు కావని ఎన్‌వోసీ ఇవ్వడంతో వాటి ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించి ఆ భూములను రైతుల నుంచి తిరిగి కొన్నట్టు రికార్డులు సృష్టించినట్టు తెలిసింది. బాధితులు దీనికి సబంధించిన ఆధారాలను సైతం పోలీసులకు అందించారు.

టీఎన్‌జీవో సొసైటీ భూములపైనా కన్ను

ఎన్నెస్పీ భూములతో పాటు సమీపంలోని టీఎన్‌జీవో సొసైటీ భూముల్లోనూ సదరు కాంగ్రెస్ నేత ఆక్రమణలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. టీఎన్‌జీవో సొసైటీ ఆధ్వర్యంలో 1987లో కొందరు రైతులనుంచి నేరుగా భూములు కొనుగోలు ప్లాట్లు చేసుకున్నారు. ఇందులో ఒక ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన వారు కొనుగోలు చేసిన భూమిని కూడా సదరు నేత కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై కూడా పోలీసులు విచారణ సాగిస్తున్నారు. 'ధరణి' వచ్చిన తర్వాత కూడా నికిలీ పహణీలు సృష్టించి వాటి ద్వారా కొన్ని భూములను రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలిసింది. అయితే ఎన్నెస్పీ భూములు తమకు సంబంధించినవి కాదని ఎన్‌వోసీలు ఇచ్చిన అధికారులతో పాటు 'ధరణి' అమల్లోకి వచ్చిన తర్వాత పహణీలు సృష్టించిన రెవెన్యూ ఉద్యోగులపైనా పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. ఇటు ఎన్నెస్పీ భూములతో పాటు టీఎన్‌జీవో సొసైటీ ఉద్యోగులు కొనుగోలు చేసిన గ్రీన్‌బెల్ట్ భూములపై తప్పుడు పత్రాలతో కబ్జాకు పాల్పడినట్టు టీఎన్‌జీవో రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఫిర్యాదు చేయడంతో కాంగ్రెస్ నేత కనుసన్నల్లో జరిగిన భూకబ్జాలపై కూపీలాగుతున్నారు. ఈ క్రమంలోనే ఖమ్మంనుంచి వీ.వెంకటాయపాలెం వరకు ఎన్నెస్పీ మిగులు భూములపై రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి సరిహద్దులు తేల్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే ఎన్నెస్పీ భూముల ఆక్రమణల వ్యవహారం బట్టబయలవుతుంది.

ఒక్క భవనం.. మూడు శాఖలు..
- డీపీఆర్వో పాత భవనం కోసం పోటాపోటీ
- వివాదం ముదరడంతో కలెక్టర్ జోక్యం 6

వ్యక్తిత్వ హనన ట్రోలింగ్‌పై మహిళా శంఖారావం
- నేడు, రేపు ఖమ్మంలో ప్రరవే రాష్ట్ర మహాసభలు
- వివిధ అంశాలపై ప్రసంగించనున్న పలువురు ప్రముఖులు 7

ఒక్క భవనం.. మూడు శాఖలు..

- డీపీఆర్వో పాత భవనం కోసం పోటాపోటీ
- సమాచార, వైద్యఆరోగ్య, పోలీసు శాఖల మధ్య జగడం
- వివాదం ముదరడంతో పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయ పాత భవనం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఒక భవనం కోసం.. మూడు శాఖల మధ్య జగడం కొనసాగుతోంది. ఈ పంచాయతీ కోసం సాక్షాత్తు కలెక్టర్ వీపీ గౌతమ్ కల్పించుకోవాల్సి వచ్చింది...! ఇంతకీ ఈ భవనాన్ని ఏ శాఖకు కేటాయించారు.. ఆ భవనం ఏమిటి? అనే వివరాల్లోకి వెళ్లితే..

1976లో ఖమ్మం నగరంలో సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి గజాల స్థలం ఉన్న ఈ కార్యాలయంలో డీపీఆర్వో , అడిషనల్ పీఆర్వో, ఏపీఆర్వో గదులతో పాటు పబ్లిసిటీ అసిస్టెంట్ల హాల్, టైపిస్ట్, కిచెన్, యాంటీ రూం, పై అంతస్తులో సమాచార కేంద్రం గ్రంధాలయం కొనసాగుతోంది. సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)ని గత ఏడాది జనవరి 18న వెంకటాయపాలెం సమీపంలో ప్రారంభించిన విషయం విదితమే. అక్కడికి సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని కూడా తరలించారు.

ఖమ్మం నగరంలో మున్నేటి పరీవాహక ప్రాంతమైన వెంకటేశ్వర నగర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అద్దెభవనంలో కొనసాగుతోంది. అయితే అద్దె ఒప్పందం ముగియడంతో ఖాళీ చేయాలంటూ భవన యజమాని వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నాడు. దీనికి తోడు గత వర్షాకాలంలో మున్నేటి వరదల మూలంగా యూపీహెచ్‌సీ భవనాన్ని తరలించాలని యోచించారు.

కలెక్టర్‌కు విషయాన్ని చెప్పడంతో పాత డీపీఆర్వో (సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం) భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవాలంటూ ఆదేశించారు. దీంతో జిల్లా వైద్యాధికారులు పాత భవన్ని పరిశీలించారు. భవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుగుణంగా లేదని ఇంజనీర్లు పరిశీలించి ప్రత్యేక డిజైన్‌తో రూ 1.56 కోట్ల నిధులను భవనం నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో ఆ స్థలంలో పక్కా భవనాన్ని నిర్మించేందుకు ఉన్న పాత భవనాలను కూల్చి వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఖమ్మం నగరంలో పోలీసు పరిశోధన కేంద్రానికి అత్యంత కీలకమైన ఫోరెన్సిక్ ల్యాబ్ మంజూరైంది. పోలీస్ జిల్లా ఉన్నతాధికారులు తాత్కాలికంగా ల్యాబ్ ఏర్పాటు కోసం భవనం అవసరం ఉందంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పాత సమాచార శాఖ కార్యాలయం భవనంపై అంతస్తు పరిశీలనకు ఆదేశించారు. పోలీస్ అధికారులు ఆ భవనం చూసుకుని ఓకే అన్నారు. ఆ శాఖ అధికారులు కూడా ల్యాబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఇదిలావుండగానే, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఇంజనీర్ల సహాయంతో సమాచార శాఖ పాత భవాన్ని కూల్చేందుకు ఎక్స్‌కవేటర్లతో వెళ్లారు. అక్కడికి పోలీసు అధికారులు వచ్చారు. భవనంలో తాత్కాలికంగా ఆస్పత్రిని మాత్రమే నిర్వహించుకోవాలని ఆదేశాలు ఉన్నాయని, దీనిని ఇతర శాఖలకు కేటాయించాలంటే సమాచార శాఖ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు రావాలంటూ కూల్చివేతను అడ్డుకున్నారు. దీంతో మూడు శాఖల మధ్య జగడం ప్రారంభమైంది.



పాత డీపీఆర్వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

కొస మెరుపు..

జిల్లాకు నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, సమాచారశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన సమాచారశాఖ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఖమ్మం జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ పరిధిని విస్తరించడానికి పూనుకున్నారు. ప్రస్తుతం డీపీఆర్వో స్థాయి నుంచి ఏడీ స్థాయికి కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదనలు పంపించగా, ఆ మేరకు సానుకూల నిర్ణయం వెల్లడయ్యింది. ఈ క్రమంలోనే సూర్యాపేట నుంచి ఉప కార్యనిర్వాహక సమాచార రేడియో ఇంజనీరింగ్ కార్యాలయాన్ని తిరిగి ఖమ్మం తరలించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ కార్యాలయాన్ని ఖమ్మం తరలిస్తే పాత డీపీఆర్వో కార్యాలయ భవనం ఏర్పాటుకు అనువైనదిగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని వేరే శాఖకు అప్పగిస్తే రేడియో ఇంజనీరింగ్ కార్యాలయానికి ఇబ్బంది అవుతుందని సమాచారశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ స్థలాన్ని ఎవరికీ కేటాయించవద్దని కోరుతున్నారు. మూడు శాఖల మధ్య జగడం చివరకు ఎటుదారితీస్తుందో చూడాలి.

పరిశీలించిన కలెక్టర్

మూడు శాఖల మధ్య వివాదం ముదరడంతో కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం సాయంత్రం డీపీఆర్వో పాత భవనాన్ని సందర్శించారు. అయితే భవనం బాగానే ఉందని దీన్ని కూల్చి వేయాల్సిన అవసరం లేదని పంచాయతీరాజ్ ఇంజనీర్లు తేల్చి చెప్పారు. దీంతో తాత్కాలికంగా కూల్చివేతను నిలిపివేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

పామాయిల్‌కు గిట్టుబాటు ధర కల్పించాలి

- కేంద్ర మంత్రిని కలిసిన పామాయిల్ సంఘం నేతలు



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పామాయిల్ సంఘం నేతలు

దమ్మపేట, ఫిబ్రవరి 9: పామాయిల్‌కు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర వ్యవసాయ సహాయశాఖ మంత్రి శోభాకరాండ్లేజ్‌ను ఢిల్లీలో కలిసి వినతి పత్రం ఇచ్చినట్టు పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు శుక్రవారం సాయంత్రం అల్లిపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ఢిల్లీలో సీఐఎఫ్ఏ(కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్) సమావేశం జరిగినట్లు తెలిపారు. అనంతరం సహాయ మంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని 2022లో టన్ను పామాయిల్ గెలల ధర రూ.23,635 ఉండగా, ప్రస్తుతం ఆధర రూ. 12,100లకు పడిపోయిందని అన్నారు. ప్రతీ టన్నుకు ఉత్పత్తి వ్యయం రూ.18000లకు పైగా అవుతుందని, అయిన ప్రభుత్వ ధర మాత్రం చాలా తక్కువగా ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం 19శాతం పై కాకుండా తెలంగాణా ఓఈఆర్ సరాసరి 4 సంత్సరాలు తీసుకొని, దానికి ఉప ఉత్పత్తుల విలువను చేర్చి ఓయిఆర్ 22శాతంపై ధర నిర్ణయించాలని అన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆంధ్ర పామాయిల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొప్పన రాఘవరావు ఉన్నారు.

అధికారులను వేధించించి నిజం కాదా?

సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 9: అధికారం శాశ్వతం కాదని పదేళ్ల తర్వాత బీఆర్ఎస్ నాయకులు తెలుసుకోవడం శుభ పరిణామం అని సీపీఐ జిల్లా సహయకార్యదర్శి దండి సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చిన్న స్థాయి ఉద్యోగులైన అంగన్‌వాడీ, ఆశా, గ్రామదీపికలను మీ గ్రామ స్థాయి నాయకులు భయపెట్టిన విషయం వాస్తవం కాదా అన్నారు. దళితును పరుష పదజాలంతో దూషించారని మాట్లాడుతున్న టీఆర్ఎస్ నాయకులు ఓ దళిత మహిళా ఉద్యోగిని పరుష పదజాలంతో దూషించి వేదించిన మీ నాయకుడిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పదేళ్ల కాలంలో ప్రతిపక్ష పార్టీల పట్ల పాలేరు నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు అనుసరించిన వైఖరి ఏమిటో గుర్తుకు తెచ్చుకుని విమర్శలు చేస్తే బాగుంటుందన్నారు. రెండవసారీ అధికారంలోకి వచ్చిన తరువాత అధికార దుర్వినియోగం, రాచకం పరాకాష్టకు చేరిందన్నారు. విపక్ష నాయకులపైన అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదుచేయించి హత్యాయత్నం కేసులు నమోదు చేయించింది నిజంకాదా అన్ని ప్రశ్నించారు.

నారా భువనేశ్వరిని కలిసిన తెలుగు తమ్ముళ్లు



భువనేశ్వరితో ఖమ్మం టీడీపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి 9: ఏపీలోని కృష్ణ జిల్లా పెనుగ్రంచిప్రోలు గ్రామంలో 'నిజంగెలవాలి' అంటూ నారా భువనేశ్వరి చేపట్టిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు పాల్గొన్నారు. కేతినేని హరీష్‌చంద్ర అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకు లు పాల్గొని భువనేశ్వరికి సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం ఆమెతో కలిసి నడిచారు. ఈ కార్యక్రమంలో నాగండ్లలక్ష్మణ్, కూచిపూడి జై, కన్నేటి పృథ్వీ, చింతనిప్పునాగేశ్వరావు, నల్లమల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 9: ఖమ్మం జిల్లా కేంద్రం టేకులపల్లిలోగల మహిళా ప్రాంగణంలో మహిళా అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత శుక్రవారం తెలిపారు. కంప్యూటర్ ట్రైనర్ పోస్టుకు ఏదైనా డిగ్రీ, పీజీడీసీఏ, ఐదు సంవత్సరాల టీచింగ్ అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. నర్సింగ్ ట్యూటర్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్, ఎంపీహెచ్‌డబ్ల్యూలలో ఐదేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తులను 12వ తేదీలోగా మహిళా ప్రాంగణం టేకులపల్లిలో అందించాలని తెలిపారు. ఇంటర్వ్యూలు అదే రోజు నిర్వహిస్తామని, వివరాలకు టేకులపల్లి మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని కోరారు.

మట్టి మాఫియా సూత్రధారి అతడే...

- 'అమ్మగూడెం' ఘటనలో ఓ బీర్ఎస్‌నేతపై ఆరోపణలు
- నేలకొండపల్లి పీఎస్‌లో ముగ్గురిపై కేసు నమోదు

నేలకొండపల్లి, ఫిబ్రవరి 9: రెండు రోజుల క్రితం నేలకొండపల్లి మండలం అమ్మగూడెంలోని దేవాలయ భూముల్లో వెలుగు చూసిన మట్టి అక్రమ తవ్వకాల వ్యవహారంలోనూ ఓ బీఆర్ఎస్ నేత ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేశ్వరపురం గ్రామంలో ఉన్న శ్రీ రాజగోపాలస్వామి, శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయాలకు 42 ఎకరాల భూమి ఉండగా అందులో 36ఎకరాల మెట్టభూమి అమ్మగూడెంలో ఉంది.

అయితే దేవాలయాలకు కమిటీలు వేయాలని ఇటీవల గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించగా అమ్మగూడెంలోని భూమికి నీటి సౌకర్యం కల్పించేందుకు బావి తీయాలని ఈ సమావేశంలో ప్రతిపాదించారు. కాగా దీనిపై నిర్ణయాన్ని మాత్రం వాయిదా వేశారు. కానీ గ్రామానికి చెందిన దండా నర్సింహారావు అనే బీఆర్ఎస్ నాయకుడు జిల్లాలో ఓ హైవే నిర్మాణం చేపడుతున్న సంస్థతో అమ్మగూడెం ఆలయ భూముల్లో బావి తీసి తద్వారా వచ్చిన మట్టిని తీసుకెళ్లేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు సంస్థవారు ఆలయ భూముల్లో బావి తీస్తుండగా గ్రామస్థులు దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దాంతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, ఈవోలు వచ్చి చూసి మట్టిని తరలిస్తున్న విషయాన్ని నిర్ధారించుకొని అదే రాత్రి నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు సంఘటనా స్థలంలో ఉన్న 6టిప్పర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో అమ్మగూడెం గ్రామానికి చెందిన దండా నర్సింహారావు, పుసులూరి వాసులతో పాటుగా మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు దేదాయ శాఖ ఈవో నారాయణాచార్యులు నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.2.50లక్షల విలువైన మట్టిని తరలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈవో ఫిర్యాదుతో నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నర్సింహారావు మూడు రోజులుగా గ్రామంలో కనిపించడంలేదని తెలుస్తోంది. దీనిపై పూర్తి విచారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి9: రాష్ట్రంలోని పాత్రికేయులందరికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ కోరిందని సమాఖ్య ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండల్‌రావు, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సాతుపాటి రామయ్య శుక్రవారం తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి బొడిగె బసవపున్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మంత్రి చాంబర్‌లో సంఘం నాయకులు కలిసినట్లు తెలిపారు. ఇప్పటికే 80శాతం కార్యాచరణ జరిగిన ఖమ్మం హౌజింగ్ సొసైటీపై నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణకుమారి మృతి

సంతాపం వ్యక్తం చేసిన ప్రముఖ నాయకులు



మణుగూరు, ఫిబ్రవరి 9: మణుగూరు మండలం పగిడేరు ఎంపీటీసీ సభ్యురాలు, సీపీఎం నేత కుంజా కృష్ణకుమారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సీపీఎంలో క్రియాశీలకంగా పనిచేసి ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఆమె మృతి పార్టీని తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకులు అన్నారు. కృష్ణకుమారి మృతదేహన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఎం జిల్లా నాయకుడు ఏజే రమేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు అయోధ్య, కామిశెట్టి రామారావు, పాయం లక్ష్మయ్య, ఏడారి రమేష్, ఎంపీటీసీ ఫోరం జిల్లా కార్యదర్శి జీ కోటేశ్వరరావులతోపాటు పలువురు నాయకులు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

జేవీఆర్ ఓసీ నుంచి

20 లక్షల టన్నుల బొగ్గు రవాణా

- కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తగూడెం జీఎం షాలెంరాజు

సత్తుపల్లి, ఫిబ్రవరి 9: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సీహెచ్‌పీ స్థాపించిన నాటినుంచి బొగ్గు రవాణా అత్యధికంగా కొత్తగూడెం ఏరియా నుంచి రవాణా చేస్తుండగా గతేడాది 11.37లక్షల టన్నులతో పోల్చితే ఈసారి 20.74లక్షల టన్నులు అధికంగా చేశామని కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి మండలంలోని కిష్టారంలోని సీహెచ్‌పీ వద్ద నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితో ఇదేవిధంగా రవాణా చేస్తే ఉత్పత్తి రికార్డులను అధికగమించవచ్చని తెలిపారు. బొగ్గు రవాణ రేకుల ద్వారా పరిశీలిస్తే ఇప్పటివరకు అదనంగా 475రేకుల బొగ్గు రవాణా చేశామన్నారు. గత రికార్డు 2,702రేకుల బొగ్గు రవాణాను అధిగమిస్తామని, బొగ్గు వినియోగం పెరిగినందున నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తిని చేసి వినియోగదగదారులకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవీ.కోటిరెడ్డి, ఏజీఎం (ఈఅండ్‌ఎం) వీ.దుర్గాప్రసాద్, డీజీఎం (ఐఈడీ) ఎన్.యోహాన్, పర్సనల్ మేనేజర్ బీ.శివకేశవరావు, డీజీఎం కే.సోమశేఖరరావు, సీనియర్ పీవో కే.దేవదాస్, ఇదర ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టోర్స్‌లో వాగ్వాదం

- ఇద్దరు మహిళా ఉద్యోగులను దూషించిన హమాలీలు
- విద్యుత్ విజిలెన్స్ పోలీసులు రంగప్రవేశం
- హమాలీలకు కౌన్సిలింగ్ ఇచ్చిన సీఐ రాజశేఖర్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 9: ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటుగా భూపాలపల్లి జిల్లాలోని రెండు మండలాలకు విద్యుత్ పరికరాలు పంపిణీ చేసే ఖమ్మం విద్యుత్‌శాఖ స్టోర్‌లో గలాట చోటుచేసుకుంది. అధికారుల తప్పిదాలు తెలుసుకున్న హమాలీలు తిరిగి అధికారులను దూషించేస్థాయికి చేరారు. ఒక వైపు ఉద్యోగులు, మరో వైపు హమాలీలు ఒకరిపై మరొక రు దూషించుకోవటంతో ఆ శాఖలోని విజిలెన్స్ పోలీసులు రంగ ప్రవే శం చేసి ఇరువర్గాలను సముదాయించి హమాలీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

ఉమ్మడి ఖమ్మంజిల్లాతో పాటుగా భూపాలపల్లి జిల్లాలోని చింతూరు, వెంకటాపురం మండలాలకు ఖమ్మం టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ స్టోర్ నుంచి విద్యుత్ ఉపకరణాలు నిర్వహణ, ఇతర విద్యుత్ అవసరాల కోసం విద్యుత్ పరికరాల పంపిణీ జరుగుతుంది. నిబంధనల మేరకు విద్యుత్ స్టోర్ నుంచి విద్యుత్ పరికరాలను తీసుకెళ్లేందుకు ఆయా విద్యుత్ ఉపకేంద్రాలకు ప్రభుత్వం కేటాయించిన వాహనాలను తీసుకొచ్చి విద్యుత్ పరికరాలను తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే చింతూరు, వెంకటాపురం లాంటి దూర ప్రాంతాల వాహనాలను ఖమ్మం స్టోర్‌కు తీసుకరావటం ఇబ్బందిగా ఉండటంతో స్టోర్ అధికారులతో సమన్వయం చేసుకొని గత పదేళ్లుగా ఒక వాహనం ద్వారానే విద్యుత్ పరికరాలు పంపిణీ జరుగుతోంది. ఇదిలాఉంటే విద్యుత్ ఉపకేంద్రాల నుంచి ఖమ్మం స్టోర్‌కు పరికరాలను తీసుకెళ్లేందుకు వచ్చే అధికారులు, ఉద్యోగులు తాము వాహనాలకు ఎక్కించిన పరికరాలను ఖమ్మంలోని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అమ్మకాలు జరుపుతూ ఉంటారు. ఇలా అక్రమ వ్యాపారంలో ఇటు విద్యుత్ స్టోర్ అధికారులు పరికరాలను తీసుకెళ్లే అధికారులకు తెలిసే జరుగుతుందని బాహటంగా విమర్శలు ఉన్నాయి.

ఖమ్మం విద్యుత్ స్టోర్‌లోని అధికారి మాటలు కాంట్రాక్టర్‌కు, వాహన యజమానికి జరిగిన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నాల్గు నెలల క్రితం విద్యుత్ స్టోర్ నుంచి పలుమార్లు అక్రమంగా విద్యుత్ పరికరాలను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ గోదాముకు తరలించారు. వాటి మొత్తం విలువ రూ.3.5 లక్షలు కాగా వాహన యజమాని స్టోర్ అధికారికి తక్కువగా డబ్బులు ఇచ్చారని వివాదం మొదలైంది. తర్వాత ఆ వాహనాన్ని స్టోర్‌కు రానివ్వకుండా నిలుపుదల చేశారు. తర్వాత పది రోజుల క్రితం స్టోర్‌లోకి వచ్చిన ఆ వాహనాన్ని కొందరు అడ్డుకోవటంతో వివాదం జరిగింది.

ఈ క్రమంలో బయటి వాహనాలు విద్యుత్ స్టోర్‌లోకి రావటంపై హమాలీలు వ్యతిరేకించారు. శుక్రవారం సాయంత్రం విద్యుత్ స్టోర్ లోని ఇన్ డోర్ ఇంజనీరింగ్ మహిళా అధికారి హమాలీలను పిలిచి బయట నుంచి వచ్చే వాహనాలకు విద్యుత్ పరికరాలను ఎక్కించాలని సూచించారు. హమాలీలు నిరాకరించడంతో ఇన్ డోర్ ఇంజనీరింగ్ అధికారిణికి గేట్ పాస్‌లు రాసే ఆర్టిజన్ మహిళా ఉద్యోగికి హమాలీల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. మహిళా ఉద్యోగులను హమాలీలు దూషించారని ఫోన్‌లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ పోలీసు అధికారులకు మహిళా అధికారి ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ ఎస్ఐ కొప్పుల రాయప్ప చేరుకొని ఇరుపక్షాలను శాంతింపచేశారు. తర్వాత విజిలెన్స్ సీఐ రాజశేఖర్ హమాలీల నాయకులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు.

మద్యం మత్తే ప్రాణం తీసింది



నీటి కాల్వలో పడిన రామకృష్ణ, ద్విచక్రవాహనం

దుమ్ముగూడెం ఫిబ్రవరి 9: ఓ వ్యక్తి మద్యం మత్తులో ద్విచక్రవాహనాన్ని నడుపుకుంటూ వెళ్లి కాల్వలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. అడవిరామవరానికి చెందిన నూప రామకృష్ణ(33) తన తల్లితో కలిసి గురువారం గౌరారంలోని బంధువుల ఇంట్లో కర్మల కోసం ద్విచక్రవాహనంపై వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం బాగా మద్యం తాగిన రామకృష్ణ ఇంటికి వెళ్తానంటూ రాత్రి ఒక్కడే ద్విచక్రవాహనంపై గౌరారం నుంచి బయల్దేరాడు. మద్యం మత్తులో ద్విచక్రవాహనాన్ని నడపలేక గ్రామశివారులోని నీటికాల్వలో పడిపోయాడు. శుక్రవారం ఉదయం గౌరారానికి చెందిన శ్యామల వెంకటేష్ సంఘటనను చూసి బంధువులకు సమాచారం అందించాడు. మద్యం మత్తులో ద్విచక్రవాహనాన్ని నడపలేక నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెంది ఉంటాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు పోటు గణేష్ కేసు నమోదు చేశారు.

ఆన్‌లైన్ జాబ్ పేరిట మోసం

- నగదు పోగొట్టుకున్న యువతి
- సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసిన పోలీసులు

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 9: ఆన్‌లైన్‌లో వర్క్ ఫ్రం హోం చేస్తూ వేలల్లో సంపాదించవచ్చు అంటూ సైబర్ నేరాగాళ్లు చేస్తున్న ప్రకటనలకు ఇల్లెందు మండలం నిజాంపేటకు చెందిన ఓ యువతి మోసపోయి తన నగదును పోగొట్టుకుంది. నిజాంపేటకు చెందిన పత్తి నవ్యశ్రీ ఆన్‌లైన్‌లో వర్క్ ఫ్రం హోం పేరిట పనిచేస్తోంది. కాగా నవ్యశ్రీకి అన్‌లైన్ కంపెనీ టార్గెట్ పేరిట కొంత నగదు జమ చేయాలని, టార్గెట్ పూర్తి అయిన వెంటనే చెల్లించిన నగదుకు వడ్డీ రూపంలో వస్తుందని నమ్మబలికారు. దీంతో నవ్యశ్రీ మూడు ధఫాలుగా రూ.91 వేలను ఆన్‌లైన్‌లో పనిచేస్తున్న కంపెనీకి చెల్లించింది. మరోమారు ఇంకొంత నగదు జమ చేయాలని ఆ కంపెనీ నుంచి రిక్వెస్ట్ రావడంతో అనుమానం వచ్చి తను ఇంతకుముందు కట్టిన నగదు తనకు ఇవ్వాలని నవ్యశ్రీ కంపెనీని కోరడంతో, నగదు తిరిగి ఇవ్వాలంటే మరో రూ.83వేలను ట్యాక్స్ చెల్లించాలని సదరు ఆన్‌లైన్ కంపెనీ తెల్పిచెప్పింది. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న యువతి పోలీసులను ఆశ్రయించింది. సైబర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

యువకుడి దారుణ హత్య





ఘటనాస్థలంలో మృతుడు ప్రవీణ్

బూర్గంపాడు, ఫిబ్రవరి 9: పాతకక్షల నేపథ్యంలో పట్టపగలు యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన శుక్రవారం భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం మోతెపట్టినగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక గాంధీనగర్‌కు చెందిన గజ్జల ప్రవీణ్‌కుమార్(23) అలియాస్ గజ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. గుమ్మడి సతీష్, అఖిల్, జేమ్స్, మౌలు అనే నలుగురు వ్యక్తులతో గత కొంతకాలంగా గజకు గొడవలు జరుగుతున్నట్టు ఎస్ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. దీంతో గజను అడ్డు తొలగించాలనే ఉద్దేశంతో శుక్రవారం పథకం ప్రకారం నలుగురు నిందితులు కలిసి మోతెపట్టినగర్ వద్ద కాపు కాసి అటుగా వెళ్లిన మృతుని తలపై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి, బూర్గంపాడు ఎస్ఐ రాజ్‌కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, అరు నెలల పసికందు ఉంది. మృతుడి తల్లి గజ్జల అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడిపై బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉన్నట్లుగా ఎస్ఐ పేర్కొన్నారు. మోతెలో పట్టపగలే హత్య చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఒకరికి తీవ్రగాయాలు
- 9 మందికి స్వల్ప గాయాలు



ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 9: ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు ఖమ్మం జిల్లా రూరల్ మండలం మద్దులపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా 9 మందికి స్వల్పగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 50 మందితో భద్రాచలం మీదుగా ఒడిశాకు వెళుతున్న బస్సు తెల్లవారుజామున ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఒడిశా రాష్ట్రం, కలిమెల ప్రాంతానికి చెందిన ఆకాష్ అనే యువకుడికి కాలుకు తీవ్ర గాయం కావడంతో వెంటనే అతడిని స్థానికులు 108ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మరో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే బస్సు బోల్తా పడిన వెంటనే డ్రైవర్, క్లీనర్ అక్కడినుంచి పరారయ్యారు. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా ఒడిశాకు చెందిన వారే కాగా ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పగాయాలైన ప్రయాణికులు ఎవరికి వారు వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీసులను వివరాలు కోరగా బస్సు ప్రమాదానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అదలేదని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

యువకుడి మృతి

టేకులపల్లి, ఫిబ్రవరి 9: ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై గోల్యాతండా సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన యువకుడు కొప్పుల మారేష్(27) గురువారం రాత్రి పాల్వంచ నుంచి ఇల్లెందుకు అత్తవారింటికి మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గోల్యాతండా సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మారేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

మహిళమెడలో గొలుసు చోరీ

అశ్వాపురం ఫిబ్రవరి 9: మండల కేంద్రమైన అశ్వాపురంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసును చోరీ చేశారు. బాధితురాలి కథనం ప్రకారం అశ్వాపురం పాత బీసీ హాస్టల్ సమీపంలో ఉన్న ఇంట్లో రాయల లక్ష్మి అనే మహిళ తన కూతురుతో కలిసి ఉంటోంది. కూతురు ఇంట్లో లేని సమయంలో ఇద్దరు వ్యక్తులు లక్ష్మి ఇంటికి వచ్చి గ్యాస్ సబ్సిడీకి సంబంధించి ఆధార్ కార్డు ఇవ్వాలంటూ మహిళను అడిగారు. తమ కూతురు ఇంట్లో లేదని మహిళ తెలపగా అక్కడే వేచి ఉన్న అగంతకులు కొద్దిసేపటి తర్వాత ఏమీ కాదని ఆధార్ కార్డు ఇవ్వాలని మభ్యపెట్టడంతో ఇంట్లోకి వెళ్లిన మహిళను నోరుమూసి చేతులు కట్టేసి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసుతో పాటు, చెవిదిద్దులు లాక్కొని వెళ్లారు. సొమ్మసిల్లిన మహిళ తేరుకునే లోపే అగంతకులు పరారయ్యారు. జరిగిన సంఘటనపై బాధితురాలు అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసింది.



'మల్టీస్పెషాలిటీ' మతలబే వేరు !

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 9: 'తొలిపూజలు అందుకునే ఓ దేవుని పేరుతో వెలిసిన ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ అనుమతులు ఇచ్చారు. అక్కడ ఓ రోగికి ఎముకకు సంబంధించిన ఆపరేషన్ చేయాలంటే సర్జన్ లేకపోవడంతో, ఇతర ప్రాంతం నుంచి తీసుకొచ్చి సర్జరీ చేయించాల్సి వచ్చింది. దీంతో రోగికి సంబంధించిన బంధువులు ఆ వైద్యుడి కోసం రెండు మూడు రోజులు వేచి ఉండాల్సి వచ్చింది...!'

- 'వైరా రోడ్డు పక్కనే ఉన్న ఓ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ కోసం వెళ్లిన ఓ యువకునికి సమయానికి కంటికి ఆపరేషన్ చేసే వైద్యులు రాలేదని.. అతని అసిస్టెంట్ ఆపరేషన్ చేయడంతో ఆ యువకునికి కన్ను పోయినంత పనైంది.. ఆ ఆపరేషన్ చేసిన వ్యక్తి మళ్లీ ఇతర ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది...'

ఇలా స్పెషలిస్టు వైద్యులు లేక పోయినా.. ఖమ్మం నగరంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు దర్జాగా వైద్యం నిర్వహిస్తున్నాయి. వీటికి తోడు కొందరు వ్యక్తులు వైద్యశాస్త్రం చదవకపోయినా ఆస్పత్రులను ఏర్పాటు చేసి వ్యాపారం చలాయిస్తున్నారు. పేరొందిన వైద్యుల పేర్లను బోర్డులపై రాయించి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి అంటూ రోగులను ఆకర్షిస్తున్నారు. రోగుల ఆపదను, అవసరాలను ఆలంబనగా చేసుకొని రూ.కోట్లు సంపాదిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఈ వైద్య వ్యాపారం కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతోంది. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు.

సాధారణంగా వైద్యవిద్య పూర్తి చేసి అనుభవం వచ్చాక ఆస్పత్రులు ఏర్పాటు చేస్తుంటారు. అయితే వైద్యాన్ని వ్యాపారంగా మార్చుతున్న కొందరు వృత్తితో సంబంధం లేకుండా ఇతర ప్రాంతాల నుంచి వైద్యులను తీసుకువస్తున్నారు. స్థానికంగా ఉన్న కొందరు డాక్టర్లను విజిటింగ్ డాక్టర్లుగా చూపించి ఆస్పత్రులు నెలకొల్పుతున్నారు. తమ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులు పనిచేస్తున్నట్లు ప్రారంభంలో ప్రకటిస్తున్నారు. వారు కొద్దిరోజులు సేవలందించి వెళ్లిపోయినా, ఆస్పత్రిలో ఇంకా వారే పని చేస్తున్నట్లు చూపిస్తూ ఇతర వైద్యుల ద్వారా సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఇలా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

- విజిటింగ్ వైద్యులతో ఆస్పత్రుల వైద్యం
- ప్రైవేటు వ్యక్తుల గుప్పిట ఆస్పత్రుల నిర్వహణ
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ
- యథేచ్ఛగా జనం సొమ్ము లూటీ



కొందరు వ్యక్తులపై ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు నామమాత్ర చర్యలు తీసుకుని వదిలేస్తున్నారు. అయితే అదే వ్యక్తులు మళ్లీ ఆస్పత్రుల పేర్లను, ప్రదేశాలను మార్చి వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల బేఖాతర్...

కొందరు మెడికల్ షాపుల యజమానులు, పెట్టుబడి పెట్టగలిగే సామర్థ్యం ఉన్న వ్యక్తులు టీమ్‌గా ఏర్పడి స్పెషలిస్టు వైద్యులను రప్పిస్తూ నగరంలో ప్రత్యేకంగా ఆస్పత్రులు, క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇది నిబంధనలకు పూర్తివిరుద్ధం. ఎవరు వైద్యం చేసినా వైద్య ఆరోగ్య శాఖ, రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కొందరు తమ ఆస్పత్రులకు రోగులను రప్పించుకునేందుకు మెడికల్ షాపుల వారితో మాట్లాడుకుని ఇతర ఆస్పత్రులకు విజిటింగ్‌కు వెళ్తున్నారు. ఒక్కో వైద్యుడు మూడు నుంచి నాలుగు ఆస్పత్రులకు కన్సల్టెంట్ వైద్యుడిగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రైవేటు ఆస్పత్రుల లెక్క ఇదీ..

జిల్లా వ్యాప్తంగా మొత్తం ఆస్పత్రులు	: 230
ఖమ్మం నగరంలో మొత్తం ఆస్పత్రులు	: 180
మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు	: 25
స్పెషాలిటీ ఆస్పత్రులు	: 50
డయాగ్నస్టిక్ సెంటర్లు	: 180
ఐవీఎఫ్ అనుమతులు ఉన్న ఆస్పత్రులు	: 5



ఆస్పత్రి ఉంటే తప్ప ఔట్ పేషెంట్‌గానీ ఇన్‌పేషంట్ వైద్యంగానీ చేయడానికి వీలు లేదు. జిల్లా కేంద్రంలో ఈ నిబంధనలేవీ పట్టించుకోవడం లేదు. ఈ తతంగం అంతా వైద్య ఆరోగ్యశాఖ కనుసన్నల్లో మామూలు గానే జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రిజిస్ట్రేషన్‌అథారిటీ కమిటీలు లేక పోవడం. జిల్లా కలె క్టర్ , ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించక పోవడంతో ఆస్పత్రుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ తదితర విషయాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిబంధనలను అమలు చేస్తాం...
డాక్టర్ రాము నాయక్,
ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఖమ్మం



ప్రైవేటు ఆస్పత్రులకి రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న ఆస్పత్రులపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వాటిపై విచారించి చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు వచ్చిన ఆస్పత్రులపై అన్ని కోణాల్లో పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే రద్దు చేస్తాం. ఔషధ దుకాణాల్లో అనుమతి లేకుండా వైద్యసేవలు కొనసాగించే వారిపై చర్యలు తీసుకుంటాం.

టీఎస్‌బీపాస్ ద్వారా నిర్మాణ అనుమతులు

- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



లేఅవుట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి9: మధ్యవర్తుల ప్రమే యం లేకుండా టీఎస్‌బీపాస్ విధానం ద్వారా నిర్మాణ అనుమతులు త్వరితగతిన ఆమోదిస్తామని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లాస్థాయి లేఅవుట్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈసమావేశంలో నగరపాలక సంస్థ పరిధిలోఒకటి, మధిర మునిసిపాలిటీ పరిధిలో1, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో3, సుడా పరిధిలో 13 ఫైనల్ లేఅవుట్ల ఆమోదంకోసం మూడు మొత్తం 21దరఖాస్తులను పరిశీలించారు. నిబంధనల మేరకు సమర్పించిన దరఖాస్తులను కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్ల అనుమతులను నిర్ణీత గడువులోగా నిబంధనల మేరకు పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని లేఅవుట్ల ఆమోదంకోసం రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్,రోడ్లు భవనాలశాఖ, టౌన్‌ప్లానింగ్ తదితర శాఖలనుంచి అనుమతుల కోసం దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన 21రోజుల్లో అనుమతులు జారీచేయాలని అన్నారు. గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకొని మొక్కలు నాటాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్ డెవలపర్స్ కూడా నిబంధనల మేరకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, జడ్పీ సీఈవో అప్పారావు,డీపీవో హరికిషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్ట్సు శ్రీనివాసులు, డీటీసీపీవో ప్రసాద్, టీపీవో వికాస్, మధిర, కొణిజర్ల తహసీల్దార్లు వేంకటేశ్వర్లు, తఫజ్జల్ హుస్సేన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తా

- కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్



మణుగూరు, ఫిబ్రవరి 9: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మహబూబాబాద్ సెగ్మెంట్ నుంచి బరిలోకి దిగుతానని మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ తెలిపారు. శుక్రవారం మణుగూరు ప్రజాభవన్‌కు వచ్చిన ఆయన స్థానిక నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీనే అత్యధిక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆవుల సర్వేశ్వరరావు, కిరన్, కూచిపూడి బాబు, గాదే కేశవరెడ్డి, బానోత్ లక్ష్మణ్, షేక్ ఆరీఫ్‌పాషా, సామా శ్రీనివాసరెడ్డి, శ్రీను, లక్ష్మణ్, రవి, జాన్, శ్రీను రామ్‌రెడ్డి, ఈశ్వర్, నరేష్, నామ రాణి, ఆసీఫ్ పాషా, రవీందర్ తదితరులు ఉన్నారు.

జీళ్లచెరువు అక్రమాలపై విచారణకు బీఆర్ఎస్ సిద్ధమా?

- కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే సహించం
- కాంగ్రెస్ నాయకుల సవాల్

కూసుమంచి, ఫిబ్రవరి 9: జీళ్లచెరువు గ్రామంలో దేవాలయ భూముల్లో అక్రమ మట్టి తోలకాలపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు విచారణకు సిద్ధమా అని జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. కూసుమంచిలో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జీళ్లచెరువులో ఆలయాల భూముల్లో మట్టి దందాపై మైనింగ్, ఎండోమెంట్ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి విచారణ జరిపి నిగ్గు తేల్చిన అనంతరమే ఇంటూరి శేఖర్‌పై పోలీసులు కేసునమోదు చేశారన్నారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తూ అక్రమంగా కేసులు నమోదు చేస్తుందంటూ తాతా మధు అనడం హస్యాస్పదంగా ఉందని విమర్శించారు. అనుమతుల మాటున అక్రమ తోలకాలపై విచారణకు సిద్ధమేనా అంటూ సవాల్ చేశారు. హైవేపేరుతో అక్రమ తోలకాలు జరిపి, అడ్డొచ్చిన ఎండోమెంట్, మైనింగ్ అధికారులను బెదిరించి బదిలీలు చేయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని ప్రశ్నించారు. ఎవరి హయాంలోనూ జరగని అక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగాయన్నారు.



కూసుమంచిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సొంతపార్టీ నేతలపైనే హత్యలు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు నమోదుచేసినా స్పందించని తాతా మధు.. ఇప్పుడు శేఖర్ విషయంలో రాత్రికి రాత్రే స్పందించడానికి కారణమేంటని ప్రశ్నించారు. తాతా మధు బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడిగా వ్యవహరించడంలేదని, ఒక్క సామాజిక వర్గానికే అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే సహించమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యడవల్లి రాంరెడ్డి, అధికార ప్రతినిధి వెంకటరత్నం, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, హఫీజుద్దీన్, చెన్న మోహన్, బజ్జూరి వెంకటరెడ్డి, ఇంటూరి పుల్లయ్య, సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, బారి వీరభద్రం, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు పంపే సామగ్రి మన్నికగా ఉండాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 9: జీసీసీ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు పంపే సామగ్రి మన్నికగా ఉండాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలో గురువారం జీసీసీ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు పంపే సరుకుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. ఆదివాసీ గిరిజనుల నుంచి సేకరిస్తున్న అటవీ ఫలాలు మధ్య దళారులు దోచుకోకుండా నేరుగా జీసీసీకే విక్రయించేలా మేనేజర్లు జీసీసీ సిబ్బంది గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఏడీ భాస్కరన్, జీసీసీ మేనేజర్లు పాల్గొన్నారు.

ఫలసాయం సేకరించేందుకు వేలం

భద్రాచలం ఐటీడీఏకు చెందిన హెచ్‌ఎన్‌టీసీ, గరిమెళ్లపాడు నర్సరీ, కొత్తగూడెంలో ఉన్న నర్సరీలలో ఫలసాయానికి చెందిన చెట్లను నాలుగు సంవత్సరాల కాలం వాటి సంరక్షణ, పోషణ, కాపలా ఫలసాయం పొందేందుకు శుక్రవారం వేలంపాట ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ సమక్షంలో నిర్వహించారు. పాల్వంచకు చెందిన శ్రీనివాసరావు రూ.6 లక్షలు చెల్లించి వేలంపాటలో హక్కులు దక్కించుకున్నారు.

ట్రోలింగ్‌పై మహిళా శంఖారావం

- నేడు, రేపు ఖమ్మంలో ప్రరవే రాష్ట్ర మహాసభలు
- వివిధ అంశాలపై ప్రసంగించనున్న పలువురు ప్రముఖులు
- బాధిత స్వరాల కలబోత 'ట్రోలింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్న అతిథులు

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 9: ట్రోలింగ్, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలన్న పిలుపుతో ప్రజా రచయిత్రుల వేదిక(ప్రరవే) రాష్ట్ర 7వ మహాసభలు 10, 11 తేదీల్లో ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో జరగనున్నాయి. సంస్థ ఏర్పడి 15 ఏళ్లవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించే సభల్లో ట్రోలింగ్ జాడ్యంపై ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే బాధితుల అనుభవాలను నేరుగా వివరించనున్నారు.

సామాజిక కార్యకర్తలు, ఉద్యమ కార్యకర్తలు, హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు, రాజకీయ, సినీ, క్రీడా తదితర రంగాల్లో ట్రోలింగ్ అధికమవుతున్న విషయం తెలిసిందే. మహిళలను కించపరుస్తూ, బెదిరిస్తూ పోస్టింగులు, వేధింపులు సర్వసాధారణమైన పరిస్థితుల్లో బాధిత మహిళల్లో ధైర్యం నింపేందుకు మహాసభల్లో ప్రత్యేకంగా చర్చించనున్నారు.

మొదటగా అనకాపల్లిలో 'మనలో మనం' పేరుతో జరిగిన మొదటి మహాసభ అనంతరం ప్రజా రచయిత్రుల వేదికగా రూపాంతరం చెంది స్త్రీ సమస్యలపై పోరాటంలో తనవంతు పాత్ర పోషిస్తోంది. రెండేళ్లకు ఒక సారి జరిగే ఈసభలు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో దఫాల వారీగా నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాలతో పాటు బహిరంగ వేధింపులకు, బెదిరింపులకు గురైన మహిళల అనుభవాలతో రూపొందించిన 'ట్రోలింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ట్రోలింగ్ అంశంపై విస్తృత చర్చలో భాగంగా నాలుగు అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారు. 'ట్రోలింగ్ నిర్వచనం మూలాలు, వర్తమానం' అనే అంశంపై వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్, 'ట్రోలింగ్ అంతర్జాతీయ సాహిత్య రంగాలు' అనే అంశంపై ప్రొఫెసర్ సునీత రాణి, 'సాంస్కృతిక కళా రంగాల్లో ట్రోలింగ్' అనే అంశంపై కవయిత్రి కృష్ణకుమారి, 'రాజకీయ రంగాల్లో ట్రోలింగ్' అనే అంశంపై ప్రముఖ ఫెమినిస్టు కొండేపూడి నిర్మల ప్రసంగిస్తారు. 'నారి సారించిన నవల' అనే నవలను ప్రముఖ స్త్రీవాద కవయిత్రి శిలాలోలిత ఆవిష్కరిస్తారు. ప్రముఖ నాస్తికుడు బైరి నరేష్, ప్రముఖ యాంకర్ ఉదయ భాను పాల్గొంటారు. ఘంటా చక్రపాణి సమాపన ప్రసంగం చేస్తారు. ఈ సందర్భంగా 'ప్రరవే' రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ప్రజా రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అనిశెట్టి రజిత, కె.ఎన్ మల్లీశ్వరి, కాత్యాయిని విద్మహే, ఓల్గా, రేణుక అయోల, పీవో డబ్ల్యూ సంధ్య, విమలక్క తదితరులు పాల్గొంటారు.



రాష్ట్ర మహాసభల గురించి వివరిస్తున్న ప్రరవే బాధ్యులు

భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం...

మహిళలపై వేధింపులను, ఫాసిస్టు చర్యలను నిరసిస్తూ విస్తృతంగా చర్చించడంతో పాటు పరిష్కార మార్గాలు కనుగొనే భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించటం ప్రజా రచయిత్రులవేదిక రాష్ట్ర 7వ మహాసభల ఉద్దేశ్యమని ప్రరవే జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు, అనిశెట్టి రజిత, కెఎన్ మల్లీశ్వరి అన్నారు. రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను వివరిస్తూ శుక్రవారం నగరంలోని హార్వెస్ట్ స్కూల్‌లో విద్యావేత్త రవి మారుత్, ప్రరవే రాష్ట్ర నాయకులు కాత్యాయిని విద్మహే, రామలక్ష్మి, మువ్వా జయశ్రీ, ఫణిమాధవితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

సామాజిక మాధ్యమాలతోపాటు బయటకూడా మహిళలను కించపరుస్తూ, అవమానపరుస్తూ దుర్భాషలాడుతూ వారిని మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. ఎదురు తిరిగిన మహిళలను బెదిరించటం, వారిపై భౌతికదాడులకు పాల్పడటం, చంపివేయటం వంటి చర్యలకు సైతం వెనుకాడటం లేదన్నారు. ట్రోలింగ్ సమస్య కారణంగా సమాజంలో ఎందరో మహిళలు తమలో తాము కుమిలిపోతున్నారని వారిలో ధైర్యం నింపి, మానసిక భరోసాను కల్పించడం సభల ముఖ్యఉద్దేశ్యం అన్నారు.

రైల్ ఓవర్ రైల్ జంక్షన్@ మోటమర్రి

ఖమ్మం మామిళ్లగూడెం/ బోనకల్, ఫిబ్రవరి 9: ప్రధానమంత్రి మానస పుత్రికగా భావించే రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా బోనకల్ మండలం మోటమర్రి రైల్వే స్టేషన్‌కు మంజూరు అయింది. మోటమర్రి-విష్ణుపురం మధ్య డబుల్ లైన్‌గా విస్తరించేందుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గంలో 88.81 కి.మీ.ల రైల్వే లైన్ డబ్లింగ్ తో పాటు మోటుమారి వద్ద 10.87 కి.మీ.ల మేర రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టుకు కూడా ఆమోదిస్తూ ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం దాదాపు రూ 1,746.20 కోట్ల అంచనాలు సిద్ధం చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రాల సరిహద్దుల్లో విస్తరించిన ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతంలో సామాజిక ఆర్థిక అభివృద్ధికి ఊతమిచ్చే అవకాశం ఉంది. ఆ రైలు మార్గం ద్వారా సికింద్రాబాద్ విజయవాడ మధ్య ఖమ్మం మీదుగా రైళ్ల రాకపోకల రద్దీని నియంత్రించడానికి మరియు రైళ్ల రవాణాను పెంచడంతో పాటు రైళ్ల రాకపోకల సమయాన్ని నియంత్రించొచ్చు.



మోటమర్రి వద్ద నిర్మించనున్న రైల్‌ఓవర్ రైల్ వంతెన నమూనా

- మోటుమర్రి - విష్ణుపురం డబుల్ లైన్ మార్గానికి గ్రీన్ సిగ్నల్
- మోటుమర్రి వద్ద రైల్ ఓవర్ రైల్ నిర్మాణం
- రూ.1746.20 కోట్లు కేటాయిస్తూ కేంద్ర క్యాబినెట్ ఆమోదం

మోటుమర్రి-విష్ణుపురం సెక్షన్‌లో 88.82 కి.మీ.ల మేర దూరం విస్తరించి, కాజీపేట - విజయవాడ మధ్య అధిక ట్రాఫిక్ రద్దీని తట్టుకునేలా సికింద్రాబాద్ - గుంటూరు వయా విష్ణుపురంతో మార్గంతో సులువవుతోంది. ఈ ప్రాజెక్ట్ తెలంగాణలోని ఖమ్మం,సూర్యాపేట, నల్గొండ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాల గుండా విస్తరించి ఉంది. కనీసం మూడు జిల్లాల్లో దాదాపు 95 మండలాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా నేరుగా ప్రయోజనం కలగనుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిసా రాష్ట్రాలు, తెలంగాణ కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో కలిపే ఒక ముఖ్యమైన రైలు అనుసంధానపు మార్గంగా ఇది నిలుస్తుంది.

ప్రతిపాదిత రైలు మార్గం ద్వారా సికింద్రాబాద్, విజయవాడకు దగ్గరి మార్గం అవుతోంది. క్లిష్టమైన విభాగాన్ని డబ్లింగ్ చేయడంతో సికింద్రాబాద్, విజయవాడ మధ్య ప్రత్యామ్నాయ మార్గంగా పనిచేస్తుంది. ఈ విభాగంలో రైలు ప్రయాణాన్ని మెరుగుపరచడమే కాకుండా, కాజీపేట, వరంగల్, ఖమ్మం మీదుగా సాగే రద్దీగా ఉండే మార్గములో రద్దీని తగ్గిస్తుంది. అంతే కాకుండా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలో వివిధ పారిశ్రామిక ప్రాంతాల నుంచి సరకు రవాణాకు సులువవుతోంది. చిట్యాల నార్కెట్ పల్లిలో ఇనుము ,ఉక్కు పరిశ్రమల నుంచి సరకు రవాణాకు సులువు కానుంది.

సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని విష్ణుపురం, జనపహాడ్ , మేళ్లచెరువు, ముట్టంపల్లి , జగ్గయ్యపేట, రామాపురం తదితర ప్రాంతాల్లో సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్ రవాణాకు కూడా అనుకూలంగా మారనుంది. విష్ణుపురం సమీపంలోనియాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (4,000 మెగావాట్లు)కు రవాణా, నల్గొండ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల నుంచి ఆహార ధాన్యాల రవాణాకు కూడా ఈ మార్గం ఉపయోగపడనుంది. ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమల నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు తరలించేందుకు, హైదరాబాద్, విజయవాడ, విష్ణుపురం, నార్కట్‌పల్లి ఎక్కువ వేర్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీల సరుకుల రవాణాకు కూడా ఈ రైలు మార్గం సుగమం కానుంది.

మేడారం జాతరకు 494 ఆర్టీసీ బస్సులు

ఖమ్మం ఖానాపురంహవేలీ, ఫిబ్రవరి 9: ములుగు జిల్లాలో మేడారం జాతరకు ఈ సారి ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలోని ఏడు డిపోల నుంచి 494 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు రీజనల్ మేనేజర్ సీహెచ్. వెంకన్న తెలిపారు. నగరంలోని నూతన బస్టాండ్‌లో శుక్రవారం డిపో మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లతో రీజనల్ మేనేజర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమల్లో ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టుగా బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రీజియన్ పరిధిలో మొత్తం 11 పాయింట్ల ద్వారా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. 130 బస్సులు ఖమ్మం రీజియన్ నుంచి, 94 బస్సులు నల్గొండ నుంచి, హైద్రాబాద్ సిటీ నుంచి 270 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గతంలో నడిపే సూపర్‌లగ్జరి, డీలక్స్ బస్సులు యథాతథంగా నడుస్తాయని తెలిపారు. ఖమ్మం నుంచి 30, ఇల్లెందు నుంచి 124, వెంకటాపురం నుంచి 11, ఏటూరునాగారం నుంచి 34, చర్ల నుంచి 10, మణుగూరు నుంచి 25, మంగపేట నుంచి 10, కొత్తగూడెం నుంచి 130, టేకులపల్లి నుంచి 25, పాల్వంచ నుంచి 45, భద్రాచలం నుంచి 50 మొత్తం 494 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మేడారంలో చోరీలకు ప్లాన్

- దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 9: రద్దీగా ఉండే బస్టాండ్ ప్రాంతాల్లో మాటువేసి ప్రయాణికుల విలువైన వస్తువులు దొంగిలించే అంతర్‌రాష్ట్ర జేబు దొంగల గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఏసీపీ హరికృష్ణ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన రావుల పార్వతి, రావుల రమణ, దాసు ఏసుమణి, దాసు యాకోబు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మల్లాది సిద్దారావు, కొమ్ము రాము, బూరుగు సత్యనారాయణ ముఠాగా ఏర్పడ్డారు. ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న సమ్మక్క జాతరలో భక్తుల విలువైన వస్తువులు, డబ్బులు చోరీ చేసేందుకు పథకం వేసుకొని, కలిసి బయలుదేరారు.


రైలులో బయలుదేరిన వీరు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో దిగి బస్టాండ్, రెల్వేస్టేషన్, మార్కెట్ ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గుర్తించి విచారించగా వ్యవహారం బయటపడింది. దీంతో నిందితులపై వన్ టౌన్, టు టౌన్, త్రీ టౌన్‌లో కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. గత కొన్నేళ్లుగా ఏపీలో వీరు చోరీలకు పాల్పడుతున్నారని, ఆయా జిల్లాల్లో వీరిపై 50 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 9: మణుగూరు పట్టణంలోని రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతంలో అన్యాక్రాంతం అవుతున్న భూమికి అధికారులు కంచె ఏర్పాటు చేశారు. సర్వే నెం.138లో ఆక్రమణలు జరిగాయనే సమాచారం మేరకు గురువారం తహసీల్దార్ రాఘవరెడ్డి సిబ్బందితో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ భూమనికి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా, ఆ స్థలాన్ని తాము కొనుగోలు చేశామని కొందరు అడ్డుకున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించడంతో వివాదం సద్దుమనిగింది.

మరుసటి రోజు శుక్రవారం అధికారులు కంచెను ఏర్పాటు చేశారు. కాగా ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. 30 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని కంచెను ఏర్పాటు చేశామన్నారు. తనతో వాగ్వాదానికి దిగిన వ్యక్తి క్షమించమని కోరినందున పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
8
శనివారం 10 ఫిబ్రవరి 2024



నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

కూసుమంచి, ఫిబ్రవరి 9: ఖమ్మంజిల్లా పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై ప్రవేశపరీక్ష నేడు శనివారం జరుగనుంది. ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు వెల్లడించారు. 9వతరగతికి 746 మంది, 11కు 1289 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 9 తరగతికి ఖమ్మం నగరంలోని జీహెచ్ఎస్ ఎన్నెస్పీ కాలనీ, రిక్కాబసార్ స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 11:15 గంటలనుంచి మధ్యాహ్నం 1:45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. 11వ తరగతికి పాలేరు నవోదయ స్కూల్ నం దు, కూసుమంచి హైస్కూల్ నందు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11:00 గంటలనుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.

శిథిల భవనాలపై ప్రత్యేక దృష్టిసారించాలి

- గ్రంథాలయం కూలిన సంఘటనలు పునరావృతం కావొద్దు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష
- ఎన్నికల విధులపై తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు అవగాహన సదస్సు





సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమ్, 54వ డివిజన్‌లో లబ్దిదారుల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 9: అన్ని నగరాల్లో, మండల కేంద్రాల్లోనూ పాత, శిథిల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను అప్రమత్తం చేశారు. ఖమ్మం నగరంలో గ్రంథాలయం కూలిన సంఘటన పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాల్లో అధికారులతో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలకు చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ భవనాలను ఆయా ఇంజనీరింగ్ శాఖలు నియతకాల తనిఖీలు చేపట్టాలన్నారు. భవనాల తనిఖీ సందర్భంగా రిజిష్టర్ నిర్వహించి, తనిఖీ అనంతరం రిజిస్టర్‌లో రిమార్కులు పొందుపర్చాలన్నారు. తనిఖీల సందర్భంలో ఆయా భవనాల్లో వుండే శాఖల అధికారులకు భవనాల భద్రతపై సలహాలు, సూచనలు చేయాలన్నారు. వర్షపు నీరు భవనాల స్లాబ్, వెంటిలేటర్‌ల వద్ద నిల్వకుండా ఉండేలా చూడాలని, టాయిలెట్ల లీకేజీలతో భవనం దెబ్బతింటుందని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. భవనాల భద్రత, భద్రతలేని భవనాల కూల్చివేత, మరమ్మతులతో ఉపయోగంలోకి తేవడంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్ శాఖలు తమ తమ పరిధిలోఎన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి, ఎన్ని కూల్చివేశారు, ఎన్ని మరమ్మతులతో వాటిని ఉపయోగంలోకి తేవచ్చొ నివేదిక సమర్పించాలన్నారు. కూల్చివేతకు నోటీసులు జారిచేసి, కూల్చివేతకు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన భవన నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, పీఆర్, గిరిజన, విద్యాశాఖ ఈఈ లు పాండురంగ విఠల్, నాగేశు, తానాజీ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక అధికారి వేణుమనోహర్, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి జయప్రకాష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జ్యోతి, కలెక్టరేట్ ఏవో అరుణ, షెడ్యూల్ సంక్షేమ శాఖ ఆర్సీఓ ప్రత్యూష, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

ఎన్నికల సంఘం ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని, అధికారులు ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు, ఎన్నికల విధులు, డిస్ట్రిబ్యూషన్, రిసీప్షన్ కేంద్రాల నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ, అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు అసెంబ్లీ సెగ్మెంట్ల కేంద్రాల్లో వుంటాయని, రిసీప్షన్ కేంద్రం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు ఉంటుందని అన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన హ్యాండ్ బుక్, పూర్తిగా చదివి, తప్పకుండా పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు కొండపల్లి శ్రీరామ్, మదన్‌గోపాల్ పవర్‌పాయిట్ ప్రజంటేషన్ ద్వారా అధికారుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎన్నికల శిక్షణ నోడల్‌అధికారి, డీఏవో విజయనిర్మల, జిల్లా సంక్షేమఅధికారిణి సుమ, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంలను తనిఖీ చేసినకలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల వినియోగానికి జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌లోని అదనపు ఈవీఎం లను వినియోగించనున్నట్లు జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాపరిషత్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్ తెరచి, అందులో భద్రపరచిన ఈవీఎంలను నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌కు ఫస్ట్ లెవల్ చెకప్‌కు తరలించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి. శ్రీనివాస్, జీఎస్ఆర్‌పి. విద్యాసాగర్, జి. పున్నయ్య, ఏ. గోపాలరావు, కె. కరుణాకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలి

ఖమ్మంకార్పొరేషన్: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకు గ్యాస్‌సిలెండర్ అందచేయడానికి లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్, నగర పాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి నగరంలో క్షేత్రస్థాయి తనిఖీలను పరిశీలించారు. కలెక్టర్, కమిషనర్ 54వ డివిజన్ వీడీవోస్‌కాలనీలో పర్యటించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్‌కనెక్షన్ నెంబర్, డిస్ట్రిబ్యూటర్ వివరాలు అధికారులకు అందచేయాలని లబ్దిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ బీ. సత్యనారాయణరెడ్డి,డీఈ నవ్యజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ, ఎస్‌లకు నోటీసులివ్వండి

- జడ్పీచైర్మన్ ఆదేశం
- ఎక్సైజ్ అధికారులపై సర్వసభ్య సమావేశం ధ్వజం



జడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో

వైరా, ఫిబ్రవరి 9: వైరా ఎక్సైజ్ శాఖపై మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎక్సైజ్ శాఖ పనితీరును ఎంపీటీసీలు తీవ్రంగా దుయ్యబట్టారు. ఎంపీపీ వేల్పుల పావని అధ్యక్షతన శుక్రవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు రాకుండా కేవలం కానిస్టేబుళ్లను మాత్రమే పంపించటం పట్ల ఎంపీటీసీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బెల్టుషాపుల్లో కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్న 14మందిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ కానిస్టేబుల్ నివేదికలో చెప్పగా సీఐ, ఎస్ఐలు ఎందుకు రాలేదని ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. బెల్టుషాపుల నిర్వాహకులపైన లేక వాటిలో విక్రయిస్తున్న కల్తీ మద్యానికి సంబంధించా కేసులు నమోదు చేసింది అని ఎంపీటీసీలు ప్రశ్నించారు. బెల్టుషాపుల్లో కల్తీ మద్యం విక్రయిస్తున్న వారిపైనే కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని కానిస్టేబుల్ సమాధానమివ్వగా బెల్టుషాపులకు లైసెన్స్‌లు ఇచ్చారా అని ఎంపీటీసీలు ప్రశ్నించారు. అయినా సీఐ కానీ ఎస్ఐలు కానీ సమావేశానికి ఎందుకు రాలేదని ఎంపీటీసీలు ప్రశ్నించారు. వెంటనే జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ స్పందిస్తూ సమావేశానికి రాని ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలతోపాటు ఇతర శాఖల అధికారులకు కూడా నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డిని ఆదేశించారు. వైరాకు వంద పడకల ఆసుపత్రి మంజూరైనందున అవసరమైన స్థలాన్ని వెంటనే సేకరించాలని రెవెన్యూ అధికారులకు కమల్‌రాజ్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి ఆరున్నర ఎకరాల స్థలం ఉండగా దాదాపు నాలుగున్నర ఎకరాల స్థలం ఆక్రమణలకు గురైందని వైద్యఆరోగ్యశాఖ అధికారులు సమావేశంలో వెల్లడించారు. దానికి స్పందించిన కమల్‌రాజ్ మాట్లాడుతూ వెంటనే ఈ ఆక్రమణల స్థలంపై సర్వే చేసి నివేదిక పంపించాలని ఆదేశించారు. ఇంకా పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. కమల్‌రాజ్‌ను ఎంపీపీ వేల్పుల పావని, జడ్పీకోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్‌మహ్మద్ సన్మానించారు. ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులుపాల్గొన్నారు.

పండితాపురంలో గ్రామ దీపికల మాయ

- రూ.4లక్షలు స్వాహా
- ఆందోళనలో డ్వాక్రా మహిళలు

కామేపల్లి, ఫిబ్రవరి 9: డ్వాక్రా మహిళల రుణాల డబ్బులను గ్రామదీపికలు మాయం చేసిన ఘటన మండల పరిధిలోని పండితాపురంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డ్వాక్రా మహిళలు స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలు తీసుకొని ప్రతీ నెల రుణం డబ్బులను గ్రామ దీపికలకు చెల్లిస్తున్నారు. అయితే గ్రామ దీపికలైన ముత్తమ్మ, అంజలి ఆ సొమ్మును బ్యాంకు ఖాతాలో జమచేయకుండా తమ సొంతానికి వాడుకున్నారు. నాలుగైదు నెలలకు సంబందిచిన నగదును డ్వాక్రా మహిళల పొదుపు ఖాతాలో జమచేయలేదు. సుమారు రూ.4లక్షలు స్వాహా చేసినట్టు సమచారం. విషయం తెలుసుకున్న అధికారులు వీవోలకు జనవరి 8న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటికి వారు స్పందించలేదని ఏపీఎం సురేందర్ బాబు తెలిపారు. వారు వివరణ ఇవ్వకపోవడంతో సీసీ వీరభద్రంకు నోటీస్ జారీ చేసి వారి వద్ద ఉన్న రికార్డులను స్వాదీనం చేసుకోవాలని సూచించారు. అయితే గ్రామ దీపికలను పక్కన పెట్టి వారి జీతం నుంచి చెరో రూ. 27వేలు శాలరీ ఏమౌంట్‌ను హోల్డ్‌లో పెట్టినట్లు సమాచారం. కానీ ఈ విషయం బయటకు పొక్కడంతో డ్వాక్ర మహిళలు లబోదిబోమంటున్నారు. గ్రామ దీపికల దగ్గర నుంచి స్త్రీనిధి లోన్ రికవరి డబ్బులు రికవరి చేసి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని డ్వాక్ర మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి/వైరా/మధిర ఫిబ్రవరి 9: సమాజంలో ఉపాధ్యాయుడిని ఉన్నతి స్థానంలో నిలిపిన సంఘం పీఆర్‌టీయూ సంఘమమే అని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మోతుకూరి మధు అన్నారు. గురువారం సంఘం ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. 14 మంది విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. వైరాలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షురాలు, వైరా జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆసంఘం జెండాను ఆవిష్కరించారు. ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు దయాకర్‌రావు, రామచంద్రరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు చిలుకూరి ఐజాక్, నాగబత్తిని స్వప్న, గృహలక్ష్మీ, జ్యోతి, విజయకుమారి, రూప, కనకమ్మ, సౌజన్య స్వర్ణలత పాల్గొన్నారు. మధిరలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లంకెల మోహన్‌రెడ్డి సంఘం రాష్ట్ర, జిల్లా బాద్యులు వెంకటేశ్వరరావు, షేక్ మదార్, ఆర్ బ్రహ్మారెడ్డి, కొమ్ము శ్రీనివాసరావు, సీహెచ్ రవికుమార్, జీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచుతాయి

- 'స్మార్ట్‌కిడ్స్' పాఠశాల క్రీడా సంబురంలో జడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, కరస్పాండెంట్ కృష్ణ చైతన్య



పోటీలు ప్రారంభిస్తున్న కమల్‌రాజ్

ఖమ్మం, ఖానాపురంహవేలి ఫిబ్రవరి 9: ఖమ్మం నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో క్రీడా ప్రాంగణంలో శుక్రవారం స్కూల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ అందరిని ఆకట్టుకుంది. ముఖ్య అతిథి జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జడ్పీ చైర్మన్ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడా పోటీలు విద్యార్థులలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీస్తాయన్నారు. స్మార్ట్‌కిడ్జ్ లో విద్యార్థులను చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, వైజ్ఞానిక అంశాల్లో ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు కబడ్డీ, కోకో, హర్డిల్స్, టెన్నికాయిడ్, అథ్లెటిక్స్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి కమల్‌రాజును పాఠశాల యాజమాన్యం సన్మానించారు.

లింక్‌కెనాల్ రద్దుచేయాలని రైతుల మొర

ఏన్కూరు, ఫిబ్రవరి 9: సీతారామ ఏన్కూరు లింక్ కెనాల్‌ను రద్దుచేయాలని శుక్రవారం తహసీల్దార్‌కు రైతులు వినతిపత్రం అందించారు. భగవాన్‌నాయక్‌తండా, రేపల్లెవాడ గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని కాలవ వల్ల గ్రామాలకు ఎటువంటిప్రయోజనం లేదని, దీనిని వెంటనే రద్దుచేయాలని తహసీల్దార్‌ను వేడుకున్నారు.కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

13న జాతర దుకాణాలకు టెండర్లు ఆహ్వానం

మధిర, ఫ్రిబవరి: మధిర శ్రీమృత్యుంజయస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర దుకాణాల ఏర్పాటుకు 13న టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఆరోజు ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్‌కమ్ బహిరంగవేలం ఉంటుందన్నారు. ఆసక్తి వున్న వారు ముందుగా డిపాజిట్ చెల్లించి పాల్గొనవల్సిందిగా కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కల్లూరు, ఫిబ్రవరి 9 కల్లూరులో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 11 పశువులను స్థానిక పోలీసులు అడ్డగించి పట్టుకున్నారు. తుని నుంచి హైదరాబాద్‌కు బొలెరో వాన్లో 9 ఆవులు, రెండు ఎద్దులు తరలించేందుకు సిద్ధంగా ఉండగా దాడి చేసి స్వాధిన పరుచుకొవటం జరిగిందని పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

కల్లూరు, ఫిబ్రవరి 9 కల్లూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని అద్రశ్యమైన సంఘటనపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈ నెల 5న ఉదయం 8 గంటల సమయంలో తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి పిర్యాదు మేరకు ఎస్ఐ షాకీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీవీ నర్సింహారావు విగ్రహానికి నివాళులు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్నం ప్రకటించిన సందర్భంగా జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని ట్యాంక్‌బండ్ సమీపంలోని పీవీ కాంస్యవిగ్రహానికి పూవలమాలలువేసి నివాళులర్పించారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, విద్యాసాగర్, శ్రీదేవి, అంజయ్య,పాల్గొన్నారు.

వికలాంగులందరికి పెన్షన్ మంజూరు చేయాలి

కారేపల్లి ఫిబ్రవరి 9: అర్హులైన ప్రతి వికలాంగుడికి ప్రభుత్వం ద్వార పింఛన్‌చేసుకునేందకు అవకాశంల కల్పించాలని కోరుతూ శక్రవారం మండల కేంద్రంలో పలువురు వికలాంగులు ఆందోళన చేపట్టారు.

జిన్నింగ్ మిల్లు ఎదుట రైతుల ఆందోళన

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి9: మండలంలోని గోల్‌తండా పంచాయతీ పరిధిలో ఉన్న కాటన్ మిల్లు ఎదుట రైతుల ఆందోళణ చేశారు. మండలంలోని ఎర్రగడ్డ గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం పత్తిని అమ్ముకునేందుకు వెళ్లారు. దీంతో మిల్లు యజమానులు క్వింటాకు రూ.5కేజీల చొప్పున తరుగు తీస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన చేపట్టారు. తరుగు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని, సీపీఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ అధికారులను కోరారు. మిల్లు యజమానులు తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని హామి ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

'గృహలక్ష్మీ' కోసం ఇంటింటి సర్వే

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 9: రాష్ట ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. 35వ డివిజన్ మోతీనగర్‌లో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. నగరపాలక సంస్థ మెప్మా డీపీ దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి దరకాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితా 500 రూపాయల గ్యాస్ బండ అమలు కోసం సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పోరేటర్ యల్లంపల్లి వెంకట్రావ్ , బొమ్ము శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ డేటా ఎంట్రీ సమర్ధంగా నిర్వహించాలి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 9: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500గ్యాస్ కనెక్షన్‌కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటా ఎంట్రీని సమర్ధవంతంగా నిర్వహించాలని జడ్పీసీఈవో వీవీ అప్పారావు తెలిపారు.శుక్రవారం మండలంలోని పిండిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. లబ్దిదారుల పరిశీలనలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాస్, ఎంపీవో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బానోతు బాలాజీ పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

చింతకాని, ఫిబ్రవరి 9: మూడవ రైల్వే లైన్ నిర్మాణ మరమ్మత్తుల్లో భాగంగా మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలోని రైల్వే గేటును ఐదు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.

పెండింగ్ చలానాల రాయితీని సద్వినియోగం చేసుకోండి

వైరా, ఫిబ్రవరి 9: ప్రభుత్వం కల్పించిన పెండింగ్ చలానాల రాయితీని ఆటోడ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని వైరా ఎస్ఐ మేడా ప్రసాద్ సూచించారు. శుక్రవారం వైరాలోని మధిర రోడ్డులో ఆటోడ్రైవర్లకు ఎస్ఐ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయితీపై పెండింగ్ చలానాలు చెల్లించాలని సూచించారు.

వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థలను నిర్వీర్యం చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి పిబ్రవరి 9: బాలలను, బాలికలు, మహిళలను వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థలనుంచి రక్షించి ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని బాలల సంక్షేమ కమిటి ఛైర్‌పర్సన్ భారతీరాణి అన్నారు, ఫిబ్రవరి 9 న జాతీయ బాండెడ్ లేబర్ వ్యతిరేకత దినోత్సవం సందరంబంగా ఏర్పటు చేసిన కార్యక్రమంలో ఆమె హజరై మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని పోలీస్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని లారి ఓనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా నిరోదక విభాగం బాద్యులు నరసింహారావు, సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 88 మంది ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 9: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జెన్ ప్యాక్ట్ కంపెని నిర్వహించిన ఇంటర్వ్యూలలో కళాశాలకు చెందిన 88 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాని నిర్దేసించుకోని సాధన క్కొఉ కష్టపడితే ఏదైన సాధ్యం అవుతుందని అన్నారు. విద్యార్థులు ప్రతి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి విజయం సాదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కంపెనీ హెచ్‌ఆర్ టి సామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

జంగాల కాలనీలో ద్విచక్ర వాహనం దగ్ధం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 9: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన సంఘటన సత్తుపల్లి మునిసిపాలిటీలో చోటుచేసుకుంది. బాధితుడు వేంసూరు మండలం చిన్నమల్లేలకు చెందిన చింతల నాగరాజు స్థానిక జవహర్ నగర్ సమీపంలోని జంగాల కాలనీకి బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున చూసేసరికి అతని ద్విచక్రవాహనం దగ్ధమై కనిపించడంతో సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 9: సత్తుపల్లి మునిసిపాలిటీలో ఒకటి, మండలంలోని పాకలగూడెంలో మరొక ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. స్థానిక గుడిపాడు రోడ్డులో నివాసముంటున్న న్యాయవాది రాచూరి సీతారామయ్య తన బైక్‌ను రాత్రి పార్క్ చేశాడు. తెల్లవారుజామున చూసేసరికి కనిపించకపోవడంతో సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. అదేవిధంగా పాకలగూడెంలో చిన్ని అనే వ్యక్తి తన నివాసంలో నిలిపి ఉంచిన వాహనం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లారు. అదేవిధంగా సత్తుపల్లి పట్టణంలో గతంలో లేనివిధంగా పదుల సంఖ్యలో వాహనాలు అపహరణకు గురవుతున్నాయని, పోలీసులు గస్తీ పెంచి రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని కొండాపురం, ముత్తగూడెం, ఎం.వెంకటాయపాలెం, పల్లెగూడెం, తీర్థాల గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం ఏడీఏ విజయచంద్ర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యాపారులకు సూచించారు.

15న ఉమ్మడి ఖమ్మం జిల్లా జేఎల్‌ఎం అభ్యర్థులకు అర్హతా పరీక్షలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 9: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబందించిన జూనియర్ లైన్ మ్యాన్ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 15న ఖమ్మం ఎస్ఈ కార్యాలయంలో అర్హతా పరీక్షలు ఏర్పాటు చేశామని ఎస్ఈ సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విద్యుత్ స్థంబం ఎక్కే పరీక్షలతో పాటుగా రాత పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారి జాబితాను పోస్టు ద్వారా పంపటం జరిగిందన్నారు. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శికంగా జరుగుతుందన్నారు.

ట్రాలీ ఢీ కొని వృద్ధుడి మృతి

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 9: ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఢీ కొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఇటీవల ఖమ్మం నగరంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రఘునాథపాలెం మండలం కామంచికల్లుకు చెందిన రుద్ర వెంకటేశ్వర్లు(64) నగరంలో టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 6న షాపును మూసి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా బైపాస్ రోడ్‌లో ఓ ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

స్వామివేషంలో వచ్చిన వారిని పోలీసులకు అప్పగింత

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 9: స్వాముల వేషధారణలో వచ్చిన పలువురు వ్యక్తులను ఖమ్మం జయనగర్‌కాలనీవాసులు అర్బన్ పోలీసులకు శుక్రవారం అప్పగించారు. స్వామివేషధారణలో ముగ్గురు వ్యక్తులు జయనగర్‌కాలనీలో ఇళ్లపైకి ఎక్కి మరీ డబ్బులు అడుగుతుండడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. దీంతో డయల్100కు ఫోన్‌చేసిన వారు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరకుని వారి వివరాలు తెలుసుకుని వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. పూర్తివివరాలు తెలియరాలేదు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి

ఖమ్మం ఖానాపురంహవేలి/తిరుమలాయపాలెం ఫిబ్రవరి 9: ఖమ్మం నగరంలోని నయాబజార్ పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 11, 12 తేదీలలో జరిగే టీపీటీఎఫ్ ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం సంఘం మహాసభలు జరిగే ప్రాంగాన్ని సందర్శించి పనుల ఏర్పాట్లను పర్శీలించారు. ఇతర జిల్లాలనుంచి వచ్చే సంఘం ప్రతినిదులకు, ఉపాధ్యాయులకు, మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా వసతి సౌకర్యాలు ఏర్పాట్లు చెయించటం జరిగిందని తెలిపారు.

అంతర్‌రాష్ట్ర జేబుదొంగల ముఠా అరెస్టు


ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 9: రద్దీగా ఉండే బస్టాండ్‌లో మాటువేసి ప్రయాణీకుల విలువైన సామన్లు దొంగిలించే అంతర్‌రాష్ట్ర జేబుదొంగల కిలాడి గ్యాంగ్‌ను ఖమ్మం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినటుట టౌన్ ఏసీపీ హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన రావుల పార్వతి, రావుల రమణ, దాసు ఏసుమణి, దాసు యాకోబులు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన మల్లాది సిద్దారావు, కొమ్ము రాము, బూరుగు సత్యనారాయణలు ముఠాగా ఏర్పడి పథకం ప్రకారం ములుగు జిల్లాలో జరుగుతున్న సమ్మక్క జాతరకు వెళ్లి అక్కడ చోరీలు చేసేందుకు బయలుదేరారు. రైలులో బయలుదేరిన నిందితులు ఖమ్మంరైల్వేస్టేషన్‌లో దిగి, బస్టాండ్ రెల్వేస్టేషన్, మార్కెట్ ప్రాంతాలలో అనుమానస్పదంగా తిరగుతుండా పోలీసులు వారిని విచారించగా వారి వ్యవహారం బయటపడింది. దీంతో నిందితులపై వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్‌లో కేసులు నమోదుచేసినట్లు ఏసీపీ తెలిపారు.

అమెరికాలో అనారోగ్యంతో సాఫ్ట్‌వేర్ యువతి మృతి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 9: అమెరికాలో ఖమ్మానికి చెందిన ఓ యువతి అనారోగ్యంతో మృత్యువాత పడింది. అమెరికాలోని ఆస్టిన్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న చావా అనిలా అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో చేరింది. ఆమెకు వైద్యచికిత్సలు చేస్తుండగానే ఫిబ్రవరి 4న చనిపోయింది. భర్త చావా సతీష్ కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. యువతి వైద్యానికి ఆమె మరణించిన తర్వాత అక్కడి కార్యకలాపాలకు ఖమ్మం జిల్లాకు చెందిన తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, తాళ్లూరి మురళి ఆమె మృతదేహాన్ని ఇండియాకు తీసుకురావడానికి అన్ని విధాల సహకరించారు. మృతురాలు అనిలా తల్లిదండ్రులు కామేపల్లి మండలం పింజర మడుగు గ్రామం అయినప్పటికీ ఖమ్మంలోని వీ.డి.ఓస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అనిలా మృతికి ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు మేదరమెట్ల స్వరూప రాణి, కానూరు హిమబిందు శ్రద్ధాంజలి ఘటించారు. అనిలా మృతదేహం శనివారం హైదరాబాద్ చేరుతుంది. అంత్యక్రియలు ఆదివారం ఉదయం ఖమ్మంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాగునీటి వనరుల హక్కుల సాధనలో కలిసి పోరాడుదాం

- మాజీ ఎమ్మెల్యే సండ్ర



తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న సండ్ర

కల్లూరు/తల్లాడ ఫిబ్రవరి 9: తెలంగాణ సాగునీటి వనరుల హక్కుల సాధనలో మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తలపెట్టిన పోరాటంలో కలిసి పోరాడుదామని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య రైతులకు, బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మండలంలోని లింగాల గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. 13న నల్లగొండలో జరగనున్న సభకు సాగర్‌ఆయకట్టు రైతులు భారీగా తరలి రావాలని సండ్ర పిలుపు నిచ్చారు. ఓటమి చెందిన ప్రజా సేవలకు పదవి విరమణ ఉండదని చెప్పారు.

పదవి విరమణ చేసిన సర్పంచులకు సండ్ర సన్మానం

కల్లూరు మండల పరిధిలో ఇటీవల పదవి విరమణ చేసిన గ్రామ సర్పంచులకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లాడ: కృష్ణా నది ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ తలపెట్టిన ఈనెల 13న జరిగే చలో నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో ఆయన చలో నల్గొండ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు రాత్రి టిపెన్ బండ్ల యజమానుల కృతజ్ఞతలు

- బండ్లు నిర్వహణ రాత్రి 10గంటల నుంచి 11గంటల వరకు పెంపు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 9: ఖమ్మం నగరంలో రాత్రి సమయంలో టిపెన్ బండ్లు నిర్వహణపై రాత్రి 10గంటల నుంచి రాత్రి 11గంటల వరకు సమయం పెంపుపై ఖమ్మం నగర ఇడ్లి గరం బండ్ల యూనియన్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంఘం అధ్యక్షుడు బోడా వీరన్న ఓ ప్రకటన విడుదల చేశారు. ఇడ్లీ బండ్లు జీవనాదారంగా తమ కుటుంబాలు సాగిస్తున్నామన్నారు. పోలీసు కమిషనర్‌కు రమణాచారి, ఆనంద్, రమేశ్, రామకృష్ణ, నర్సింహా కృతజ్ఞతలు ప్రకటించారు.

మరోసారి మోదీ ప్రభుత్వం ఖాయం: బీజేపీ

నేలకొండపల్లి/కల్లూరు, ఫిబ్రవరి 9: మూడోసారి దేశంలో మోదీ సర్కార్ ఏర్పడబోతోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ అన్నారు. గావ్ ఛలో...బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనాసాగరంలో జరిగిన కార్యక్రమంలో కిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కల్లూరు మండలం రామకృష్ణాపురంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఖమ్మంపార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీ జిల్లా నాయకుడు అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువులు బీజేపీలో చేరారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.